క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత జవాన్ మృతి

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని బీరేపల్లి సమీపంలోని కిమెల్ గేట్ వద్ద శనివారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో విశ్రాంత జవాన్ అచ్చప్ప (55) అక్కడికక్కడే మృతి చెందారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అప్‌గ్రేడ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయండి



కేంద్ర మంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: కర్ణాటక రాష్ట్రానికి ఆనుకుని ఉన్న మడకశిర నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరుతూ శనివారం బెంగళూరులో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి వినతిపత్రం అందించినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. మడకశిర పట్టణ సమీపంలోని పారిశ్రామికవాడ, అగళి మండలంలోని గాయత్రి కాలనీ వద్ద పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కేంద్ర మంత్రి కుమారస్వామి మడకశిర ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



అంజినప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ

పెనుకొండ: రొద్దం మండలం నారనాగేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అంజినప్ప శనివారం గుండెపోటుతో చనిపోయారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శంకరనారాయణ ఆ గ్రామానికి చేరుకొని అంజినప్ప భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విశ్వేశ్వరయ్య జీవితం స్ఫూర్తిదాయకం



మోక్షగుండం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

హిందూపురం: దేశ భవిష్యత్తును రూపొందించడంలో ముఖ్యపాత్రను పోషించే ఇంజినీర్లకు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం స్ఫూర్తి అని హిందూపురం బీఐటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని కళాశాలలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి జ్యోతులు



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరుడు

అమరాపురం: మండలంలోని బసవనపల్లిలో శనీశ్వరస్వామికి భక్తులు జ్యోతుల ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతులను ఊరేగింపుగా తీసుకొని బస్టాండ్ దగ్గర ఉన్న ఆలయంలో శనీశ్వరస్వామికి సమర్పించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతురాలు త్రివేణి

పావగడ: కొత్తూరు గ్రామంలో త్రివేణి (24) అనే మహిళ ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. అరసికెరె ఎస్‌ఐ తారాసింగ్ వివరాలమేరకు.. త్రివేణి తన ఏడాది వయసు గల కుమార్తెతో శనివారం గొల్లరహట్టి నుంచి పుట్టినిల్లు కొత్తూరు గ్రామానికి వచ్చింది. అక్కడ సొంతంగా కట్టుకుంటున్న ఇంటిపై భాగంలో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించడానికి ఉపక్రమించింది. ఇనుప కడ్డీని పడేసే క్రమంలో 11 కేవీ విద్యుత్ తీగ తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేయొద్దు



రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయడానికి ప్రయత్నిస్తుండటం అన్యాయం. మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైద్య విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణానికి అన్ని చర్యలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం కాలేజీల నిర్మాణాలను అడ్డుకుంటుండటం సరికాదు. మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరమైతే పేద విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మెడికల్ సీట్లు తక్కువగా ఉండడంతోనే నాకు సీటు రాలేదు. దీంతో వైద్య విద్య కోసం చైనాకు వెళ్లాల్సి వచ్చింది.

– అంజలి, వైద్య విద్యార్థిని, అగళి



పేద విద్యార్థులకు తీరని అన్యాయం



పెనుకొండ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను ఆపేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం సరికాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మిగతా మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తుండటం దారుణం. ఈ నిర్ణయాల వల్ల పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుంది. ఇదే జరిగితే వైద్య విద్య కేవలం ధనికులు మాత్రమే చదవగలుగుతారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ నిర్ణయాలను పునః సమీక్షించుకొని వెంటనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొదలు పెట్టిన మెడికల్ కాలేజీలను పూర్తి చేయాలి.

– కెంచప్ప, మద్దనకుంట, అమరాపురం మండలం

పశువులిలా.. వెళ్లేదెలా?

- రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులు
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



సోమందేపల్లిలో రోడ్డుపై ఉన్న ఆవులు



జాతీయ రహదారిపై వాహనాలకు అడ్డంగా నిలిచిన ఆవులు

సోమందేపల్లి: రోడ్లపై పశువుల సంచారంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాటి యజమానులు ఇష్టారాజ్యాంగా వదిలేస్తుండటంతో జాతీయ రహదారిపై అవి ఎక్కువగా సంచరిస్తున్నాయి. మండల కేంద్రమైన సోమందేపల్లిలోని రోడ్డులోనే అడ్డుగా తిష్ట వేస్తున్నాయి. దీనికితోడు పశువులు పోట్లాడుతూ అటువైపు వెళ్లే వారిపై దాడులకు దిగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వారపు సంతలో అయితే గుంపులుగా చొరబడి అటు వ్యాపారులు, కూరగాయల కొనుగోలుకు వచ్చిన వారిని ఇబ్బంది పెడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలన్నర క్రితం ఆవులు సంతలో చొరబడి నలుగురిని గాయపర్చాయి. సంతలో కూరగాయలు లాక్కుని వెళుతూ తీవ్రంగా నష్టం చేకురుస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. వాల్మీకి సర్కిల్‌తో పాటు హిందూపురం రోడ్డుపై రాత్రివేళల్లో పదుల సంఖ్యలో పశువులు తిష్ట వేసి రాకపోకలకు అంతరాయం కల్గిస్తున్నాయి. నడుచుకొని వెళ్లే వృద్ధులు, మహిళలు, చిన్నారులు గాయపడ్డారు.

జాతీయ రహదారిపై ప్రమాదాలు

ఎన్.హెచ్.44 జాతీయ రహదారిపై నిత్యం పశువుల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పెనుకొండ నుంచి సోమందేపల్లి మార్గంలో ఎక్కువగా ఆవుల సంచారం ఉండడంతో లారీలు ఢీ కొని పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఒక్కోసారి వాటిని తప్పించే క్రమంలో వాహనాలు బోల్తాపడి అందులో ప్రయాణించే వారు గాయపడి ఆస్పత్రి పాలవుతున్నారు. రెండేళ్ల క్రితం సంతలో పశువులు దాడి చేయడంతో శీలా వరదమ్మ అనే మహిళ మృతి చెందింది. నెలన్నర క్రితం వెంకటాపురం తండా వద్ద రోడ్డుకు అడ్డంగా రావడంతో బెంగళూరు వైపు వెళ్లే కారు ఢీ కొని ఆవు మృతి చెందింది. కారులో ఉన్న వారు కూడా గాయపడ్డారు. అధికారులు పశువుల యజమానులతో మాట్లాడి రోడ్డుపైకి పశువులను వదలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు ఇలా..

జాతీయ రహదారిపైకి పశువులు వెళ్లకుండా చూసుకోవాలి. జాతీయ రహదారి సంస్థ ఆధ్వర్యంలో రహదారికి ఇరువైపులా రెయిలింగ్ నిర్మించాలి. కానీ చాలా చోట్ల లేకపోవడంతో పశువుల వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రైతులు కూడా పశువులను ఇష్టానుసారంగా వదిలితే చట్టపరంగా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సి ఉన్నా.. కొందరు వాహనదారులు మద్యం మత్తులో పశువులను ఢీ కొంటున్నారు. అధిక శాతం రాత్రి వేళలో కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



పశువుని ఢీకొని ప్రమాదానికి గురైన కారు (ఫైల్)

పశువుల బెడద ఎక్కువగా ఉంది



సంతలో పశువుల బెడద ఎక్కువగా ఉంది. పశువులు కూరగాయలను లాక్కెళ్తుండటంతో వ్యాపారులు కూడా నష్టపోతున్నారు. కొనుగోలుదారులు వాటి బారిన పడి గాయపడుతున్నారు. సుంకం వసూలు చేయించే అధికారులు సంతలో పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలి. అవసరమైతే వాటిని గోసంరక్షణ కేంద్రాలకు తరలించాలి.

– శీలా నారాయణస్వామి, సోమందేపల్లి

హైవేపై తరచూ ప్రమాదాలు



సోమందేపల్లి పరిధిలోని జాతీయ రహదారిపై ఆవుల సంచారంతో అధికంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి యజమానులపై కేసులు నమోదు చేయాలి. అమాయకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై పశువులు మృతి చెందినా రోజుల తరబడి వాటిని కళేబరాన్ని హైవే అధికారులు తొలగించడం లేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.

– కుమార్, సోమందేపల్లి

బాలసదన్‌కు బాలికల తరలింపు



బాలికలను బాలసదన్‌లో చేర్చే విషయంపై వెంకటేష్ దంపతులతో చర్చిస్తున్న సీడీపీఓ

పెనుకొండ: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో భిక్షాటన చేస్తున్న నలుగురు బాలికలను సీడీపీఓ శాంతలక్ష్మి, సిబ్బంది శనివారం హిందూపురంలోని బాలసదన్‌కు తరలించారు. సీడీపీఓ వివరాల మేరకు... వెంకటేష్ దంపతులకు నలుగురు ఆడ పిల్లలు, ఒక బాలుడు ఉన్నారు. అయితే వారికి ఉండటానికి ఇంటితో పాటు తినడానికి తిండి కూడా లేక నానా అవస్థలు పడుతున్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో బాలికలు యాచకులుగా మారి కుటుంబాన్ని పోషిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న సీడీపీఓ, సిబ్బంది రైల్వేస్టేషన్‌కు చేరుకుని వెంకటేష్ దంపతులను కలిసి చిన్నారుల భవిష్యత్తుపై అవగాహన కల్పించారు. బాలసదన్‌లో పిల్లలను చేర్పడం ద్వారా వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని పేర్కొన్నారు. వెంకటేష్ దంపతులు కూడా అంగీకరించడంతో వారిని హిందూపురంలోని బాలసదన్‌లో చేర్పించారు. కార్యక్రమంలో ఎర్రమ్మ, చంద్రకళ, కృష్ణవేణి, మహేష్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం



హిందూపురం: కక్షిదారులకు అవార్డు ప్రతులు అందిస్తున్న జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ



మడకశిర: జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్

- జిల్లా అదనపు జడ్జీ కంపల్లె శైలజ
- లోక్ అదాలత్ ద్వారా 332 కేసుల పరిష్కారం

హిందూపురం అర్బన్: రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. ఇరు వర్గాలు రాజీ కావడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. శనివారం హిందూపురం కోర్టులో ఇన్‌చార్జి లోక్ అదాలత్ మెజిస్ట్రేట్ బొజ్జప్పతో కలిసి జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ఏడీజే ప్రారంభించారు. న్యాయమూర్తి శైలజా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం వల్ల ఇరు వర్గాలకు వ్యయ ప్రయాసలు తగ్గుతాయన్నారు. అనంతరం రెండు బెంచ్‌లను ఏర్పాటు చేసి 115 కేసులను పరిష్కరించారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శశిధర్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, లోక్‌అదాలత్ సభ్యులు సిద్ధూ, కళావతి, సంతోషికుమారి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ఏపీపీలు నగేష్, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో...

మడకశిర: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. జడ్జి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఈలోక్ అదాలత్ జరిగింది. మొత్తం 83 కేసులను పరిష్కరించారు. 8 బ్యాంక్ కేసులను రూ.8,11,700 సెటిల్‌మెంట్ చేశారు. రూ.50 వేలు అపరాధ రుసుం విధించి 49 క్రిమినల్ కేసులను పరిష్కరించారు. రూ.7.20 లక్షలకు 4 ఎస్‌టీసీ కేసులను పరిష్కరించారు. రూ.63,220 అపరాధ రుసుంతో 19 ఎక్సైజ్ కేసులను పరిష్కరించారు. అలాగే మూడు సివిల్ కేసులను కూడా పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని పోలీసులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

పెనుకొండలో...

పెనుకొండ: పట్టణంలోని కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 134 కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ సయ్యద్ ఫసలల్లా తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 3 కేసులు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 37 కేసులు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 35 కేసులు, అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో 50 కేసులు, ఎల్ఎస్‌సీ పెనుకొండ కేసులకు సంబంధించి 19 కేసులు పరిష్కారమైట్లు న్యాయమూర్తులు తెలిపారు.

గొల్లపల్లి రిజర్వాయర్‌లో జలహారతి



జలహారతి ఇస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: మండల పరిధిలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖా మంత్రి సవిత జలహారతి నిర్వహించారు. గత కొన్ని రోజులుగా రిజర్వాయర్‌లోని కృష్ణా జలాలు నిరవధికంగా ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రిజర్వాయర్‌కు చేరుకున్న మంత్రి జలహారతి నిర్వహించి ప్రజలకు, రైతులకు మంచి జరగాలని ఆకాంక్షించారు.

కియా రాకతో వేలాది మందికి ఉపాధి

కియా పరిశ్రమ రాకతో పెనుకొండ దాని పరిసర ప్రాంతాల్లో వేలాది మందికి ఉపాధి లభించిందని మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని దుద్దేబండ పంచాయతీ కేంద్రంలో కియా సీఎస్ఆర్ నిధులతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి మంత్రి శనివారం భూమి పూజ చేశారు.

విశిష్ట సేవలకు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న ముద్దరంగప్ప

అమరాపురం: సర్వేపల్లి రాధాకృష్ణన్ 136వ జయంతిని పురస్కరించుకుని తిరుపతిలోని యువతేజం ట్రస్ట్, కలాం విజన్ ఢిల్లీ ప్రతినిధులు సంయుక్తంగా శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగానే అమరాపురం మండలం కె శివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముద్దరంగప్పకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించారు.

పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్

చిలమత్తూరు: మండలంలోని చిలమత్తూరు, కోడూరు పీహెచ్‌సీల్లో శనివారం ప్రభుత్వ వైద్యులు ఓపీ సేవలు పూర్తిగా బంద్ చేశారు. జీఓ నంబర్ 85ను రద్దుపై ప్రభుత్వం ఎలాంటి అనుకూల ప్రకటన చేయకపోవడంతో శనివారం ఓపీ సేవలు బంద్ చేసినట్లు ఏపీపీహెచ్‌సీడీఏ స్టేట్ ప్యానల్ మెంబరు, జిల్లా అధ్యక్షుడు డా. పి రామకృష్ణ తెలిపారు. సోమవారం నుంచి విజయవాడలో ఆందోళనలు చేపడతామన్నారు. ఇప్పటికే అన్ని పీహెచ్‌సీల వద్ద నోటీసు అతికించినట్లు పేర్కొన్నారు. ఓపీ సేవలు బంద్ కావడంతో పేద ప్రజలు వైద్యం కోసం వచ్చి వెనుదిరిగారు.



ముక్కిడిపేట కూర్మవాహన గణపతిని కోనేరులో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న నిర్వాహకులు



పట్టణంలోని బైపాస్ రోడ్డులో చివరిగా నిలిచిపోయిన సూరప్పకట్ట మహాగణపతి

రెండోరోజూ కొనసాగిన నిమజ్జనం

హిందూపురం: హిందూపురం పట్టణంలో శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన వినాయక విగ్రహాల నిమజ్జనం శనివారం కూడా కొనసాగింది. కొనేరులో కూడా విగ్రహాలను సరిగ్గా నిమజ్జనం చేయకపోవడంతో ఒకదానిపై ఒకటి పడిపోయాయి. జేసీబీలతో విగ్రహాలను పక్కకు లాగేస్తూ నిమజ్జనాలు కొనసాగించారు. విగ్రహాలను 8వ రోజు నిమజ్జనాలు చేయలేమని, 9 రోజు చేస్తే బాగుంటుందని కొందరు నిర్వాహకులు పట్టుబట్టారు. ఆఖరికి అధికారులు, పోలీసుల చొరవతో అన్ని విగ్రహాల నిమజ్జనం జరిగింది.